

సాక్షి బాపట్ల

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



బ్యారేజీ నుంచి నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి 3,007 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ఇంకా బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,10,540 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 2,50,853 క్యూసెక్కులు వదులుతున్నారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరిగే నిత్యాన్నదానానికి కృష్ణాజిల్లా పోరంకికి చెందిన కొమ్మినేని ప్రతాప్‌కుమార్ దంపతులు శనివారం రూ.లక్ష విరాళం అందించారు.

ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసులు



కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను, భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తూ, ప్రత్యర్థులపై అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికం. సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తపై ఆ పత్రిక ఎడిటర్‌ను బాధ్యున్ని చేస్తూ కేసు నమోదు చేయడం దుర్మార్గం. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాసే హక్కు ఏ ప్రభుత్వానికీ ఉండదు. కూటమి ప్రభుత్వం దాదాపు రూ.2 లక్షల కోట్ల రుణాలు చేసి ప్రభుత్వ భూములను, అభివృద్ధి పేరుతో పందేరం చేస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు అవినీతిపరులుగా మారారు. వారిపై ఎటువంటి కేసులు పెట్టకుండా వారి అవినీతి విషయాలను వెలుగులోకి తీసుకువస్తున్న పత్రికలపై అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారింది. సాక్షి దినపత్రిక ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి.

– వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు, జనచైతన్య వేదిక



మీడియా స్వేచ్ఛను హరించాలనుకోవటం దుర్మార్గం



మీడియా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరించాలనుకోవటం దుర్మార్గం. ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నించే హక్కు మీడియాకు ఉంది. తప్పులను ఎత్తి చూపినప్పుడు వాటిని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. అది వదిలి ప్రశ్నించిన గొంతుని నొక్కాలనుకోవటం దుర్మార్గమైన రాజకీయ చర్య. వీటన్నిటికి భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. సమాజంలో ఫోర్త్ స్టేట్ అయినా మీడియాపై తప్పుడు కేసులు నమోదు చేసి ఎడిటర్లను పోలీస్‌స్టేషన్లకు విచారణ పేరుతో తిప్పించటం కూటమి ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం.

– కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గురజాల

న్యూస్‌రీల్

బాపట్ల ఎస్పీగా బి. ఉమామహేశ్వర్

ఎస్పీ తుషార్ డూడీ చిత్తూరుకు బదిలీ



బాపట్ల టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎస్పీల బదిలీల్లో భాగంగా బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ చిత్తూరు జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన గతేడాది జులై 17న బాపట్ల జిల్లాకు ఎస్పీగా నియమితులయ్యారు. 14 నెలలపాటు ఎస్పీగా విధులు నిర్వర్తించారు. ఆయన స్థానంలో సీఐడీలో పని చేస్తున్న బి. ఉమామహేశ్వర్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన డీఎస్పీగా పోలీస్ శాఖలో చేరారు. గతంలో గుంటూరు జిల్లాలోని గురజాల, కడప, తెలంగాణ రాష్ట్రంలోని అదిలాబాద్‌లో డీఎస్పీగా పని చేశారు. అడిషనల్ ఎస్పీగా అదిలాబాద్, వరంగల్ అర్బన్‌లో సేవలందించారు. ఎస్పీగా ఇంటిలిజెన్స్, విజిలెన్స్ విభాగాల్లో పని చేశారు. ప్రస్తుతం సీఐడీలో పని చేస్తూ బదిలీపై బాపట్లకు ఎస్పీగా వస్తున్నారు.

పకడ్బందీగా ప్రభుత్వ పథకాల అమలు

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



బాపట్ల: ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం బాపట్ల జిల్లా కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏఓ మల్లికార్జునరావు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. దీనికి ముందు అనంతపురం జిల్లాలో 18 నెలల పాటు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశాల హాల్స్, రెవెన్యూ శాఖ పరిధిలో పలు విభాగాలు, ల్యాండ్ రికార్డ్స్, ఆర్డీఓ కార్యాలయాలు, ఆవరణలోని పరిసరాలను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు నరేంద్ర వర్మ, కొండయ్యలు కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలసి బొకేలు అందజేశారు.

లోక్ అదాలత్‌లో 239 కేసులకు పరిష్కారం

జిల్లా జడ్జి కె.శ్యామ్‌బాబు



బాపట్ల: స్థానిక జిల్లా కోర్టుల సముదాయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా ఆరవ అదనపు జిల్లా జడ్జి కె.శ్యామ్‌బాబు అధ్యక్షతన మూడు బెంచీలు ఏర్పాటు చేశారు. 239 కేసులకు గానూ రూ.1.32 కోట్ల లావాదేవీలను పరిష్కరించారు. ఇందులో 25 సివిల్, 212 క్రిమినల్, రెండు ప్రీలిటిగేషన్ కేసులు ఉన్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి, ఎం.పవన్‌కుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గవిని శ్రీనివాసరావు, బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంచర్ల అవినాష్ ,లోక్ అదాలత్‌సభ్యులు బీమా లీలాకృష్ణ, కమల్‌కుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ దుర్మరణం



జక్రయ్యబాబు (ఫైల్)

కప్తానుపాలెం(మోపిదేవి): మండలంలోని కప్తానుపాలెం వద్ద 216 జాతీయ రహదారిపై శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాస్టర్ కొక్కిలిగడ్డ జక్రయ్య(54) అక్కడికక్కడే మృతి చెందారు. స్థానిక ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా జువ్వలపాలేనికి చెందిన జక్రయ్యబాబు తన అత్తగారి ఊరు అయిన చల్లపల్లి మండలం పాగోలుకు పని మీద వచ్చి ద్విచక్ర వాహనంపై తిరిగి వెళుతున్నారు. మార్గంమధ్యలో కప్తానుపాలెం వద్ద ఎదురుగా వస్తున్న కారుని బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో జక్రయ్యబాబు అక్కడికక్కడే మృతి చెందారు. అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ , చల్లపల్లి సీఐ ఈశ్వరరావు ఘటనా స్థలంకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పకడ్బందీగా యూరియా పంపిణీ

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్
- పంపిణీ కేంద్రాలను నిత్యం తనిఖీ చేయాలి
- పంటలు వేసిన మండలంలోనే రైతులకు యూరియా అందజేయాలి
- ఫిర్యాదులకు కంట్రోల్ రూం ఏర్పాటు



మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: జిల్లాలో రైతులకు ఇబ్బంది లేకుండా పకడ్బందీగా యూరియాను పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి శనివారం సాయంత్రం ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం నుంచి ఆదివారం వరకు ఎంత యూరియా అవసరముందో మండల వ్యవసాయ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. గత సంవత్సరంలో సాగు, ఈ ఏడాది సాగును అంచనా వేసుకుని, దానికనుగుణంగా తెప్పించుకోవాలని ఆయన తెలిపారు. మండలానికి వచ్చిన స్టాకు, రైతు కేంద్రాలకు పంపిణీని ప్రతిరోజు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రైతులు ఏ మండలంలో వ్యవసాయం చేస్తున్నారో అక్కడే పంపిణీ చేయాల్సిన బాధ్యత మండల వ్యవసాయ అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు. మండలాలలో ఇప్పటి వరకు చేసిన యూరియా పంపిణీ, ఇంకా ఎంత అవసరం ఉందో అంచనాలు వేసుకోవాలని తెలిపారు. మండలానికి ఎంత అవసరం ఉందో అంతే ఇస్తామని స్పష్టం చేశారు. ఎరువుల కొరత, అధిక ధరల వసూలుపై కంట్రోల్ రూం (82470 40131) నంబర్‌కు ఫోన్ చేసేలా రైతులకు అవగాహన కలిగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి యూరియా పంపిణీ కేంద్రం వద్ద గ్రామ వ్యవసాయ అధికారి, వీఆర్వో, వీఆర్ఏ, ఒక పోలీస్ అధికారి ఉంటూ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఎవరికైనా ఎక్కువ ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జాయింట్ టాస్క్ ఫోర్స్ కమిటీ ప్రతిరోజు రైతు కేంద్రాలను పరిశీలించాలని ఆయన చెప్పారు. రైతు కేంద్రాలకు వచ్చే రైతులకు ముందుగానే టోకెన్లు ఇవ్వాలని, అందరికీ ఉన్న యూరియా చాలకపోతే వారికి ముందుగానే సమాచారం తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ అన్నపూర్ణ, జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ పాల్గొన్నారు.

యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టండి !

యూరియా సరఫరాపై వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గల మార్క్‌ఫెడ్ స్టాక్ స్టోర్ అవేజ్ గొడౌన్‌ను ఆయన తనిఖీ చేశారు. జిల్లాకు వచ్చిన యూరియా, ప్రస్తుత నిల్వలు, రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్, డీసీఎంఎస్‌లకు పంపిణీపై అధికారులను ఆరా తీశారు. యూరియా పంపిణీలో సమస్యల గురించి వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవేజ్ గొడౌన్ నుంచి సక్రమంగా రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్, డీసీఎంఎస్‌లకు యూరియాను పంపాలని ఆయన ఆదేశించారు. సీఎంఏఐడీ యాప్ ద్వారా రైతులకు యూరియాను అందజేయాలని చెప్పారు. యూరియా కొనుగోలులో సమస్యలు, అధిక ధరల అమ్మకాలకు సంబంధించి రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఎరువుల కోసం వచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

ఇంద్రకీలాద్రిపై వారాంతంలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వారాంతం, రెండో శనివారం సెలవు కావడంతో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శనివారం తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరో వైపు అమ్మవారికి నిర్వహించిన పలు విశేష పూజల్లో ఉభయదాతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, శ్రీచక్ర నవార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమం, శాంతి కల్యాణంతో పాటు హోమాలలో ఉభయదాతలు పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారికి మహానివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 క్యూలైన్ల భక్తులు బారులు తీరి కనిపించారు. రద్దీ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



క్యూలైన్‌లో దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

డీఎం అండ్ హెచ్ఓ విజయమ్మ



కొల్లూరు : జ్వరాలు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎం అండ్ హెచ్ఓ విజయమ్మ తెలిపారు. కొల్లూరు పీహెచ్‌సీని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో డెంగీ, మలేరియా జ్వరాల జాడ లేదని, అయితే వైరల్ ఫీవర్స్ కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. దీనికి ప్రధాన కారణం ఇటీవల కృష్ణా నదికి వరదలు కావచ్చన్నారు. భూగర్భ జలాలు పెరిగిన పక్షంలో ఇన్‌ఫెక్షన్స్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉండొచ్చని వివరించారు. జ్వరాలు బారిన ప్రజలు పడకుండా తాగునీటిని కాచి చల్లార్చిన తర్వాతే తాగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటు బారిన పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రతి గ్రామంలో తాగునీటి నమూనాలను సేకరించి రీజినల్ రీసెర్చ్ సెంటర్‌కు పంపించాలని వైద్యాధికారిణిని ఆదేశించారు. పంచాయతీ, మండల పరిషత్తు అధికారులతో సమన్వయం చేసుకొని పరిశుభ్రమైన తాగునీరు పంపిణీకి కృషి చేస్తామన్నారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టే విధంగా పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. ప్రజలు కూడా ఆర్ఎంపీలను ఆశ్రయించకుండా ప్రభుత్వ వైద్యశాలలో లేదా నిపుణులైన వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స పొందాలని ఆమె సూచించారు. ఆర్ఎంపీలు కూడా జ్వరంతో వచ్చిన వారికి ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, హైడోస్ ఇంజక్షన్లు, ఫ్లూయిడ్స్, స్టెరాయిడ్స్ వాడరాదని హెచ్చరించారు. హెవీ డోస్ ఇంజక్షన్లు, మందులు వినియోగంతో జ్వర తీవ్రత తాత్కాలికంగా తగ్గినప్పటికీ, కొద్ది రోజుల్లోనే తిరిగి తిరగబెట్టడం, రోగ నిరోధకశక్తి తగ్గిపోతుందని తెలిపారు.

అమరేశ్వరాలయ ట్రస్టు బోర్డు నియామకం

అమరావతి: అమరేశ్వరాలయానికి పాలక వర్గాన్ని నియమిస్తూ దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ అనువంశిక ధర్మకర్తల వారసుడు రాజా వాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్, పీసపాటి నాగేశ్వర శర్మ, వడ్లమూడి శివపార్వతి, మేకల శివశంకర్, ఘంటా పున్నారావు, పోలిశెట్టి వెంకటసత్యనారాయణ, ఆలా వీరబాబు, నాదెండ్ల శ్రీదేవి, సూరేపల్లి అనూషా, మేడా వెంకటరమణ, మేడికొండ ఉషారాణిలతోపాటు ఆలయ ముఖ్య అర్చకుడు కైతేపల్లి సుధీర్‌శర్మలు పాలకవర్గసభ్యులుగా నియమితులయ్యారు.

అతివేగానికి రెండు ప్రాణాలు బలి





ప్రమాదంలో మృతి చెందిన పరిమి ఆదామ్ బాబు(19) , కొమ్మువరపు షారోన్ (19)

- ద్విచక్రవాహనంతో ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకుల దుర్మరణం
- మృతుడు షారోన్ పల్నాడు జిల్లా వాసి
- విజయవాడ– మచిలీపట్నం రహదారిపై రోడ్డు ప్రమాదం

గూడూరు: అతివేగం రెండు ప్రాణాలు బలి తీసుకుంది. ఇటుకల లోడు ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ఘటన శనివారం విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై గూడూరు మండలం తరకటూరు దగ్గర జరిగింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. జీవనోపాధి కోసం విజయవాడ సమీపంలోని పెనమలూరు మండల పరిధిలో నివాసం ఉంటున్న పరిమి ఆదామ్ బాబు(19), కొమ్మువరపు షారోన్(19), కోట కౌశిక్(21) శనివారం ద్విచక్ర వాహనంపై మంగినపూడి బీచ్‌కు బయలుదేరారు. మధ్యాహ్న సమయంలో పామర్రు మండలం నిమ్మకూరు నుంచి ఇటుకల లోడుతో మచిలీపట్నం వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టారు. దీంతో వాహనం నడుపుతున్న ఆదామ్‌బాబుతోపాటు వెనుక కూర్చున్న, కొమ్మువరపు షరీన్, కోట కౌశిక్ తీవ్ర గాయాలపాలయ్యారు. తలకు బలమైన గాయమవడంతో ఆదామ్‌బాబు ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందగా, షరీన్ 108లో మచిలీపట్నం ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు విడిచాడు. కౌశిక్‌కు ప్రాణాపాయం లేదని వైద్యులు నిర్ధారించారు. ప్రమాద విషయం తెలుసుకున్న పెడన సీఐ నాగేంద్ర కుమార్, సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి పరిస్థితి సమీక్షించారు. గూడూరు ఎస్ఐ కె.ఎన్.వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిమి ఆదామ్ బాబు(19), కోట కౌశిక్(21) స్వస్థలం ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం పొన్నవల్లి గ్రామం కాగా, కొమ్మువరపు షారోన్(21) స్వస్థలం పల్నాడు జిల్లా అంబడిపూడి. సమీప బంధువులు అయ్యే వీరు ముగ్గురు జీవనోపాధి కోసం విజయవాడకు వచ్చినట్టు పోలీసు విచారణలో వెల్లడైంది.

తెనాలి నుంచి తీరాలు దాటిన ప్రతిభ

- ఇంటర్న్ నుంచి గ్లోబల్ లీడర్ వరకు
- అనుదీప్ ముత్తవరపు ప్రస్థానం
- కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో సత్తా చాటిన అనుదీప్
- కేంద్ర ప్రభుత్వం నుంచి 'యూత్ ఐకాన్' ప్రత్యేక గుర్తింపు



తాను చదివిన కెల్లొగ్ యూనివర్సిటీలో విద్యార్థులతో...



అనుదీప్ ముత్తవరపు

తెనాలి: ఒక చిన్న స్టార్టప్ కంపెనీలో చేరిన పదేళ్లలోనే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఒకటైన సంస్థలో అతి పిన్నవయస్కుడైన సీనియర్ డైరెక్టర్‌గా అనుదీప్ ముత్తవరపు ఎదిగారు. క్లౌడ్, డేటా, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో సాంకేతికతలకు నాయకత్వం వహిస్తున్నారు. ఆరు దేశాల్లో విస్తరించిన రెండు వందలమంది సభ్యుల బృందాన్ని నిర్వహిస్తూ, ప్రపంచవ్యాప్తంగా అత్యవసర సేవల సిబ్బందికి సాధికారత కల్పించే పది బిలియన్ డాలర్ల పోర్టుఫోలియోకు మార్గదర్శకత్వం వహిస్తున్నారు. ఆ కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం 'యూత్ ఐకాన్' గౌరవాన్ని అందించింది.

చదువుకునే దశ నుంచే..

అనుదీప్ ముత్తవరపు సొంతూరు తెనాలి సమీపంలోని వరహాపురం. తండ్రి ఉద్యోగరీత్యా తెలంగాణకు వెళ్లారు. గుంటూరు జిల్లాలోని కేఎల్ యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో అనుదీప్ ఇంజినీరింగ్ చదివారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో టెలీకమ్యూనికేషన్స్‌లో మరో మాస్టర్స్ డిగ్రీ చేశారు. నార్త్ వెస్టర్న్ కెల్లొగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ చదివారు. విద్యార్థి దశలోనే పలు కార్యక్రమాలను చేపట్టి గుర్తింపు పొందారు. కేఎల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదివేటప్పుడే స్టూడెంట్ ఆర్గనైజేషన్స్‌కు అధ్యక్షుడిగా పనిచేశారు. కెల్లొగ్ స్కూలు ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ చేసినప్పుడు చూపిన ప్రతిభకు 'డీన్స్ లీడర్‌షిప్ అవార్డు'ను పొందారు.

పిన్నవయస్కుడు ఆయనే...

2015లో టెక్సాస్‌లోని ప్లానోలో ఉన్న కోడియాక్ అనే చిన్న స్టార్టప్ టెక్నాలజీ సంస్థలో ఇంటర్న్‌గా అనుదీప్ కెరీర్ ప్రారంభించారు. 2017లో మోటరోలా సొల్యూషన్స్ కంపెనీ కోడియాక్‌ను టేకోవర్ చేసింది. కొద్ది సంవత్సరాల్లోనే ఇంజినీర్ నుంచి మేనేజర్, డైరెక్టర్ పదవుల నుంచి ఏకంగా సీనియర్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. మోటరోలా కంపెనీ చరిత్రలోనే ఆ పదవిని పొందిన అతి పిన్న వయస్కుడిగా అనుదీప్ గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆరు దేశాల్లో గల ఆయన బృందంలోని 200 మంది సభ్యుల్లో ఎక్కువమంది ఆయనతోపాటు ఉద్యోగాలు చేసినవారే ఉన్నారు. ప్రజా భద్రతా సాంకేతికతలకు అందించిన సేవలకుగాను అనుదీప్, గత జనవరిలో కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి 'యూత్ ఐకాన్–2025' అవార్డు స్వీకరించారు. గుంటూరుకు చెందిన విశ్రాంత కాలేజీ ప్రిన్సిపాల్ కొల్లి కృష్ణప్రసాద్ కుమార్తె, డల్లాస్‌లోనే డేటా సైంటిస్ట్‌గా చేస్తున్న సుస్మితతో అనుదీప్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది.

మృత్యువులోనూ వీడని బంధం

అనారోగ్యంతో భార్య, పురుగుమందు తాగి భర్త మృతి



నాదెండ్ల: వృద్ధాప్యంలో బతుకు భారమై దంపతులు మృతి చెందిన విషాదకర సంఘటన శనివారం పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం కనపర్రు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కనపర్రు గ్రామానికి చెందిన బండారుపల్లి నారాయణ (77) అలివేలు (75) దంపతులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వీరి కుమారుడు, కుమార్తెలకు వివాహాలై వేరుగా ఉంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి భార్య అలివేలు ఆరోగ్యం క్షీణించి మృతి చెందింది. భార్య మృతిని తట్టుకోలేకపోయిన భర్త నారాయణ ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి మృతి చెందాడు. వృద్ధ దంపతుల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

దసరా ఏర్పాట్లలో అలసత్వం వద్దు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల ఏర్పాట్లు నాణ్యత ప్రమాణాలతో ఉండాలని, ఎటువంటి అలసత్వం ఉన్నా, భక్తులకు అసౌకర్యం కలిగినా ఇంజినీరింగ్ అధికారులదే బాధ్యతని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన ఏర్పాట్లను పోలీసు, దేవస్థానం అధికారులతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ శనివారం పరిశీలించారు. సుమారు నాలుగు గంటల పాటు ఆలయ పరిసరాల్లో కలియ తిరిగి ఏర్పాట్ల వివరాలు తెలుసుకున్నారు. తను గుర్తించిన పలు లోపాలను ఆలయ ఈఈ శీనానాయక్, ఇంజినీరింగ్ అధికారులకు తెలిపి వెంటనే సరి చేయాలని ఆదేశించారు. తొలుత ఘాట్‌రోడ్డు నుంచి ఆలయ ప్రాంగణంలోని గాలి గోపురం వరకు క్యూ లైన్లలో నడిచి వెళ్లిన కలెక్టర్ లక్ష్మీశ తాగునీరు, క్యూ లైన్ల ఫ్యాన్లను సరి చేయాలని సూచించారు. క్యూలైన్లకు వాడిన ఐరన్ పైపుల వల్ల భక్తులకు గాయాలు కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. కొండ దిగువన, క్యూలైన్ల మధ్యలో కార్పొరేషన్ సహకారంతో టాయిలెట్లు ఏర్పాటు చేసి, వాటిని నిరంతరం శుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు, బిస్కెట్లను పంపిణీ చేయాలని సూచించారు. లక్ష్మీగణపతి విగ్రహం వద్ద గతంలో కొండ రాళ్లు విరిగి పడిన ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. మళ్లీ రాళ్లు విరిగిపడే పరిస్థితులు కనిపిస్తున్నాయని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏడీసీపీ జి.రామకృష్ణ, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, దుర్గగుడి ఈఈ శీనానాయక్, ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కొండపై అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,000** గరిష్ఠం : రూ. **2,800**

మోడల్ ధర రూ. **2,400**

క్లుప్తంగా

మొబైల్ మెడికల్ రైలు ప్రారంభం



లక్ష్మీపురం: మొబైల్ మెడికల్ రైలు ఉద్యోగుల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని గుంటూరు డీఆర్ఎం సుధేష్ఠ సేన్ అన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో శనివారం ఈ రైలును డివిజన్ వైద్య నిపుణులు లలిత, కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యులు, పారామెడికల్ సిబ్బందితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రైలులో రైల్వే ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు, స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన చికిత్స అందిస్తారన్నారు. పని చేస్తున్న స్టేషన్‌ల వద్దే సేవలు అందుతాయని చెప్పారు. డాక్టర్ సీహెచ్ శ్రీనివాసు, డీఎంవో డాక్టర్ వి.సింధు దీన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం.రమేష్‌కుమార్, సీనియర్ డీఓఎం జె.శ్రీనాథ్, సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): రాష్ట్రంలో రైతులకు యూరియా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మండిపడ్డారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగినా తగ్గింపు ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. గుంటూరు కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి యూరియా రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని ధ్వజమెత్తారు. అందువల్లే రైతులకు అందలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.విట్టల్ రెడ్డి, పీపీ జగన్నాథం మాట్లాడుతూ.. యూరియా కొరత తీవ్రంగా ఉంటే గతంలో కంటే బాగా సరఫరా చేశామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు.

లోక్ అదాలత్‌లో 643 కేసులకు పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు వెన్నెల, శ్రీవాణి

రేపల్లె(చెరుకుపల్లి): మండల న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి రేపల్లె కార్యాలయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 643 కేసులు పరిష్కరించినట్లు రేపల్లె సబ్ కోర్టు, పీడీఎం కోర్టు జడ్జీలు వెన్నెల, శ్రీవాణి తెలిపారు. ఇందులో సివిల్ -44, క్రిమినల్-599 కేసులు ఉన్నట్లు చెప్పారు. కేసులు పరిష్కారానికి రెండు బెంచ్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. కేసుల పరిష్కారంలో ఇద్దరు జడ్జీలతో పాటు న్యాయవాదులు డి.ఎస్. హరికుమార్, యు.శ్రీనివాసరావులు లోక్ అదాలత్ సభ్యులుగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. కేసుల పరిష్కారంలో కక్షిదారులకు రూ. 1.13 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

22న చలో అసెంబ్లీ జయప్రదం చేయండి

ఏపీ కౌలు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు



కరపత్రం ఆవిష్కరిస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

నరసరావుపేట: కౌలు రైతుల సంక్షేమం, హామీల అమలుకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 22న విజయవాడలో నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమంలో కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు పిలుపునిచ్చారు. శనివారం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో చలో అసెంబ్లీ ర్యాలీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరిబాబు మాట్లాడుతూ కౌలు రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 400 మంది రైతులు, కౌలు రైతులు ఆత్మహత్య చేసుకుంటే ఆయా కుటుంబాలను పరామర్శించలేదని, పరిహారం ఇవ్వలేదని మండిపడ్డారు. అసెంబ్లీ, మండలిలో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కౌలు రైతు కొత్త చట్టం అమలుకు కృషి చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థ విధానాలే కౌలు రైతుల ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని విమర్శించారు. కౌలు రైతుల సంక్షేమం కోసం సంఘం ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలు చేస్తామని తెలిపారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, సంఘం నాయకులు టి.పెద్దిరాజు, కె.ఆంజనేయులు, అమరలింగేశ్వరరావు పాల్గొన్నారు.

చెట్టుపై పడిన పిడుగు



మాచవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షానికి మాచవరం సెయింట్ ఆన్స్ లయోలా ప్రేమ నిలయం హాస్టల్ ఆవరణలో కొబ్బరి చెట్టుపై శనివారం పిడుగు పడింది. ఆ సమయంలో విద్యార్థులందరూ హాస్టల్ గదుల్లోనే ఉండడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని సిస్టర్ కవిత తెలిపారు. పిడుగు పడిన సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి సరఫరాను నిలిపివేశారు. ఘటన స్థలాన్ని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు పరిశీలించారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు అంజి అక్రమ అరెస్టు

వెల్దుర్తి: మండలంలోని గొట్టిపాళ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బిక్కెం అంజిని పోలీసులు శనివారం అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఆయన ప్రస్తుతం తెలంగాణ లోని మల్లేపల్లి వద్ద నివాసం ఉంటున్నారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన అంజిపై అక్రమ కేసులు బనాయించిన పోలీసులు అరెస్టు చేసి ఎక్కడకు తీసుకెళ్లారో కూడా తెలుపలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

బాలుడి మృతదేహం కాలువలో లభ్యం

వారం కిందట అదృశ్యం

కొల్లూరు: కనిపించకుండా పోయిన బాలుడు శవమై కాలువలో లభ్యమైన సంఘటన కొల్లూరులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు శివారు కేటీ కాలనీకి చెందిన తుమ్మా చింతయ్య కుమారుడు సుబ్రహ్మణ్యం (12) చిన్ననాటి నుంచి మతిస్థిమితం లేకుండా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 6 నుంచి కనిపించకపోవడంతో నిరక్షరాసులైన తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికి ఊరుకున్నారు. అప్పట్నుంచి కనిపించకుండా పోయిన బాలుడు పశ్చిమ బ్యాంక్ కెనాల్ నుంచి కేటీ కాలనీ వైపు ప్రవహించే పంట కాలువలో శవమై శనివారం కనిపించాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు తల్లిదండ్రులతో పాటు కొల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెంది వారం రోజులు గడుస్తుండటంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి, ఛిద్రమైన స్థితిలో ఉంది. కొల్లూరులో ఈనెల 6న రెండు వినాయక నిమజ్జనోత్సవాలు జరిగాయి. ఇందులో ఏదో ఒక విగ్రహ ఊరేగింపు వెంట బాలుడు వెళ్లి, కాలువలో పడి మరణించి ఉండవచ్చనే అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.ఫిట్స్‌తో బాధపడుతున్న తమ కుమారుడు ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి మరణించి ఉండొచ్చని తండ్రి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జానకీ అమరవర్ధన్ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాప్రతినిధులకు ఏపీటీఎఫ్ మెమోరాండం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ చేపట్టిన నిరసన వారం ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రజాప్రతినిధులకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మహమ్మద్ ఖాలీద్‌లు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసి నాయకులు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా బసవ లింగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏ ఒక్క పెండింగ్ బకాయిలు విడుదల చేయలేదని తెలిపారు. రెండేళ్లు గడిచినా పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించలేదన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు మాట్లాడుతూ అనవసరమైన యాప్స్ రద్దుకు కృషి చేయాలని కోరారు. అస్సెస్మెంట్స్ బుక్‌లెట్ల రద్దుకు మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజాతోపాటు ఎమ్మెల్యేలు ఎండీ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్‌లను వారి కార్యాలయాల్లో కలిసి మెమోరాండం అందజేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా పాత తాలూకా కేంద్రాలు, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.. ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా శాఖ అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్, నాయకులు గడిపాటి దాస్, బి.శ్రీనివాసరావు, షేక్ ఇబ్రాహీం, శివారెడ్డి, మాలకొండయ్య, శ్రీధర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం నియామకానికి మల్లగుల్లాలు

- వర్గాల పోరుతో కూటమి పాలకులు వెనుకడుగు
- శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఇదీ పరిస్థితి



ఆలయ గాలి గోపురం

మంగళగిరి: రాజధానిలో ప్రతిష్టాత్మకమైన మంగళాద్రిలో వేంచేసిఉన్న శ్రీ పానకాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయ పాలకవర్గం నియామకంపై కూటమి ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ఆగస్టు 26వ తేదీతోనే పాలక వర్గానికి దరఖాస్తుల దాఖలు ముగియగా, 36 మంది కూటమి నాయకులు చేశారు. ఆలయ అధికారులు వాటిని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపారు. రాజకీయ జోక్యం అధికం కావడం, పాలకవర్గ సభ్యులను నియమించేందుకు కూటమి నాయకులలో పోటీ, పదవులు విక్రయించుకున్నారనే విమర్శలతో ప్రభుత్వం ముందడుగు వేయలేకపోతోంది. భారీగా ఆదాయం వచ్చే ఆలయ కావడంతో పాలకవర్గం తమ చేతులలో ఉంచుకోవాలని కూటమి పార్టీలు పట్టుదలతో ఉన్నాయనే చర్చ జోరుగా సాగుతోంది. పాలకవర్గంలో ఎక్స్ అఫీషియో సభ్యుడితో కలిపి 12 మంది సభ్యులకు అవకాశం ఉంది. ట్రస్ట్ బోర్డు చైర్మన్ సహా ఇతర పదవులలో అధికంగా తమ వారిని నియమించాలని బీజేపీ పట్టుపడుతున్నట్లు తెలిసింది. ఇదే స్థాయిలో జనసేన, టీడీపీ నుంచి కూడా పోటీ అత్యధికంగా ఉంది. పాలక వర్గం నియామకంపై ప్రభుత్వం, మంత్రి ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. పాలకవర్గాన్ని వెంటనే నియమించి ఉత్కంఠకు తెరదించాలని కూటమి పార్టీల నాయకులు కోరుతున్నారు.

గోవులను తరలిస్తున్న వారికి బెదిరింపులు

నిందితుడిపై కేసు నమోదు

మంగళగిరి: గోవులను తరలిస్తున్న లారీని ఆపి డబ్బు డిమాండ్ చేసిన గుంటూరుకు చెందిన వ్యక్తిపై కేసు నమోదైంది. శనివారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అనిల్ బెహరా గతంలో బీజేపీలో కొనసాగాడు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కొంత కాలంగా గోవులను తరలిస్తున్న లారీలను ఆపి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నాడు. చిలకలూరిపేటకు చెందిన గోవుల స్మగ్లింగ్ వ్యాపారి ఇతనికి సహకారం అందిస్తున్నాడు. శనివారం నగర పరిధిలోని కాజ టోల్ గేట్ వద్ద లారీని ఆపి బెదిరింపులకు దిగగా, తాము చట్టప్రకారం రవాణా చేస్తున్నామని, డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించడంతో రూరల్ స్టేషన్‌లోని పోలీస్ సిబ్బంది సహకారంతో అనిల్ లారీని స్టేషన్‌కు తరలించాడు. లారీ బిల్లులు తనిఖీ చేసిన పోలీసు అధికారులు అక్రమ రవాణా జరగడం లేదని చెప్పారు. లైవ్ స్టాక్ ఆన్ వీల్స్ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనిల్ బెహరాపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు గోపీపై విచారణకు ఆదేశం

కర్లపాలెం: మండల పరిధిలోని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడిగా గతంలో పనిచేసిన మద్దెన గోపీపై వచ్చిన ఆరోపణలపై విద్యాశాఖ అధికారులు విచారణ జరిపేందుకు సిద్ధమయ్యారు. ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికీ వచ్చిన రూ.3,800ను స్వాహా చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై 'విద్యార్థుల సొమ్ము స్వాహా' అంటూ పత్రికల్లో కూడా కథనాలు రావడంతో గోపీపై విచారణ జరిపేందుకు సిద్ధమయ్యారు. ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తమ్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి సురేష్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన ఈనెల 15న చింతాయపాలెం ఉన్నత పాఠశాలకు వెళ్లి ఎన్‌సీసీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను విచారించనున్నారు.

సబ్ జైల్లో ఉన్న కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే బొల్లా ములాఖాత్



ములాఖాత్ అయిన తర్వాత జైలు నుంచి బయటకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ: నరసరావుపేట సబ్‌జైలులో ఉన్న వైఎస్సార్ సీపీకి చెందిన కార్యకర్తలతో వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబరు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శనివారం ములాఖాత్ అయ్యారు. బొల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అన్యాయంగా 307 కేసులు నమోదు చేసి కోర్టు ద్వారా రిమాండ్ విధించడం దారుణమన్నారు. మా కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. వినుకొండ నియోజకవర్గంలో ప్రతిచోట టీడీపీ అరాచక పాలన కొనసాగిస్తుందని, ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. శావల్యాపురం మండలం కారుమంచి గ్రామ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. పార్టీ శ్రేణులు ఏకతాటిపై నిలిచి తప్పుడు కేసులకు ప్రతిఘటనగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఈపీఎస్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్సీ గోపిమూర్తికి విజ్ఞాపన పత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని ఈపీఎస్ పెన్షనర్ల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి డిమాండ్ చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఎ.శాస్త్రి అధ్యక్షతన శనివారం రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్యఅతిథి గోపిమూర్తి మాట్లాడుతూ.. ఈపీఎస్ పెన్షనర్ల సమస్యలపై కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలో మూడు లక్షలుగా ఉన్న ఈపీఎస్ పెన్షనర్లకు సామాజిక పెన్షన్లు ఇవ్వడానికి శాసనమండలిలో ప్రశ్నిస్తానని హామీ ఇచ్చారు. 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించి మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆలిండియా కోఆర్డినేషన్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.మోహనన్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో పెన్షనర్లు పీఆర్సీ లబ్ధి పొందకుండా పెన్షన్ రీవాల్యుడేషన్-2025 బిల్లును తీసుకురావడం అన్యాయమన్నారు. దీనికి వ్యతిరేకంగా పెన్షనర్లు అందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు ఎం.జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో రెండు ప్రభుత్వాలు పెన్షనర్ల సమస్యలపై బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు తీర్మానాలను ప్రవేశపెట్టి భవిష్యత్ కర్తవ్యాలను వివరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు పెన్షనర్లు తరఫున ఎమ్మెల్సీ గోపిమూర్తికి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సదస్సులో బ్యాంకు పెన్షనర్స్ సంఘం నాయకుడు ఎం.రామారావు, రైల్వే పెన్షన్ సంఘం నాయకుడు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.